క్లుప్తంగా

ఉచిత విద్య - ఉచిత శిక్షణ



మంగళగిరి: 19 నుంచి 35 సంవత్సరాల యువతీ యువకులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో ఉచిత విద్య శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. పట్టణంలోని ఐబీఎస్ ప్రెస్ క్లబ్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ప్రతినిధులు వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో 13 కేంద్రాల్లో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని మంగళగిరిలో ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు. శిక్షణ ఇచ్చిన బ్యాంకర్లుతో రుణాలు ఇప్పించి ఔత్సాహిక ప్రోత్సాహకులను తీర్చిదిద్దుతామన్నారు. ఔత్సాహికులు 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న యువతీ యువకులకు ప్రఖ్యాత ఎల్లి, కెరియర్, ఎయిర్ కాన్, బ్లూస్టార్ కంపెనీలలో ప్లేస్మెంట్స్ అవకాశముంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కె.నాదప్రసాద్, శ్యాంప్రసాద్, కె. రామారావు, వి.ఉదయలక్ష్మి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

అనంతవరంలో సెబ్ అధికారుల దాడులు

తాడికొండ: తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో అక్రమంగా తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో మంగళగిరి సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఒక జేసీబీతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఓ నిర్మాణ కంపెనీకి చెందిన కార్యాలయానికి అనుమతులిచ్చారంటూ తవ్వకాలు చేపట్టి కొండ ప్రాంతంలో నేలను చదును చేస్తుండగా అధికారులకు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఇది స్థానికంగా ఎవరు చేస్తున్నారు, వెనుక సూత్రధారులు, పాత్రధారులు ఎవరనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు



మేడికొండూరు: వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు మేడికొండూరు ఎస్సై డేవిడ్ రాజు మంగళవారం తెలిపారు. పేరేచర్ల సమీపంలో నివాసం ఉంటున్న కొల్లిపర సైమన్ కుమారుడు తొమ్మిది సంవత్సరాల అరుణ్‌కుమార్ ఈనెల 12న ఉదయం 6 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం తండ్రి సైమన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అరుణ్‌కుమార్ ఆచూకి తెలిస్తే 8688831382 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

శ్రీకృష్ణభగవానుడి ఆశీస్సులతో సస్యశ్యామలంగా ఉండాలి



తెనాలి: శ్రీకృష్ణ భగవానుని ఆశీస్సులతో తెనాలి ప్రాంతం సస్యశ్యామలంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆకాంక్షించారు. పట్టణ బుర్రిపాలెం రోడ్డులోని గోశాల వద్దగల శ్రీగోపాలకృష్ణుని మందిరం వద్ద రెండో రోజైన మంగళవారం జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. శ్రీస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణను స్వయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ 71 సంవత్సరాలుగా ఇక్కడ శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు క్రమం తప్పకుండా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న వారిని అభినందించారు. పర్వదినం సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించడం, గోవుల పోషణ, సంరక్షణకు తోడ్పాటు నివ్వటం సంతోషకరమని చెప్పారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తాడిబోయిన రమేష్, తాడిబోయిన అఖిలేష్‌లు శ్రీగోపాలకృష్ణ మందిరంలో జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకల విశిష్టతను తెలియజేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, ఆవుల కోటయ్య, కఠారి హరీష్, కుర్రా శ్రీను, మన్నవ ప్రభాకర్, దేశబోయిన శ్రీనివాసరావు, చీమకుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- నందులపేటలోని కవిరాజ పార్కు వద్ద గల శ్రీకృష్ణమందిరం వద్ద రెండోరోజు కృష్ణాష్టమి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని పూలమాలను సమర్పించారు. స్వామి ఆశీస్సులను అందుకున్నారు. 'అరసం' జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమం వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు పెబ్బింగ్ సుభాని, టి.పెద్దబాబు, తాడిబోయిన బుజ్జిబాబు, తోట దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.
- రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీకృష్ణమందిరం వద్ద గోపాలకృష్ణ మందిర కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు రెండవ రోజు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు మేడిబోయిన గంగాయాదవ్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు బచ్చనబోయిన శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

భద్రత పెంచాలి



కోల్‌కతాలో వైద్యురాలి హత్య ఘటన అనంతరం బయటకు వెళ్లాలంటే భయం వేస్తోంది. వైద్య ఆరోగ్య మహిళా సిబ్బందికి ప్రభుత్వాలు భద్రత కట్టుదిట్టం చేయాలి. ఇలాంటి ఘటనలు జరిగిన సమయంలో రాత్రి వేళల్లో విధులకు హాజరుకావాలంటే ఇబ్బందిగా ఉంది. రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులపై దాడి చేసే వారిని కఠినంగా శిక్షించాలి. వైద్యుల రక్షణకు పకడ్బందీగా చట్టాలు అమలు చేయాల్సిన అవసరం ఉంది.

– పి.అన్నపూర్ణ, స్టాఫ్ నర్స్, కొల్లిపర



మహిళలను గౌరవించడం నేర్పాలి



పురుషులతో పోటీపడి ప్రతి రంగంలో మహిళలు వారితో సమానంగా పనిచేస్తున్నారు. మహిళలు పనిచేసే చోట తగిన భద్రత కల్పించాలిన అవశ్యకతను కోల్‌కతా వైద్యురాలి ఘటన సూచిస్తోంది. ఇటువంటి దారుణాలు జగరకుండా ఉండాలంటే కుటుంబంలోని తల్లీ, చెల్లిని గౌరవించినట్లే బయట మహిళలను కూడా గౌరవించేలా తమ పిల్లలకు తల్లిదండ్రులు బాల్యం నుంచే నేర్పాలి. స్త్రీ, పురుషులు పరస్పరం గౌరవించుకున్నపుడే మహిళల అత్యాచారాలు, హత్యలు ఆగుతాయి.

పి.వజిదా, ల్యాబ్ టెక్నీషియన్, కొల్లిపర

విజయకీలాద్రిపై శ్రీకృష్ణాష్టమి మహోత్సవం



పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న డాక్టర్ ముక్కామల అప్పారావు దంపతులు



వేణుగోపాల స్వామి వారికి నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం, విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై మంగళవారం శ్రీకృష్ణాష్టమి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళా శాసనములతో మంగళవారం ఉదయం 9 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారికి అభిషేకం, సామూహిక శ్రీమద్ భగవద్గీత పారాయణం, సాయంత్రం 5.30 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ, అష్టోత్తర శతనామార్చన, క్షీర తర్పణం, శ్రీ కృష్ణ అవతార వైభవం, ప్రసాద నివేదన, మంగళా శాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించామని, శ్రీకృష్ణ ఆలయ యజమానులు డాక్టర్ ముక్కామల అప్పారావు, చిన్నయ విజయ దంపతులు శ్రీకృష్ణ పెరుమాళ్ళకు పట్టువస్త్రాలు సమర్పించారని, ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణ అనుగ్రహాన్ని పొందారని ఆయన తెలిపారు.

సురక్షిత గ్రామజ్యోతిపై శిక్షణ



వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న దాసరిబాలయ్య, సాల్మన్‌పాల్, ప్రసూనలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం మైఛాయిస్ ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామజ్యోతిపై సురక్షిత గ్రామ కార్యకర్తలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు దాసరి బాలయ్య పాల్గొని మాట్లాడారు. సురక్షిత గ్రామాల కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు పలు అంశాలపై శిక్షణ ఇవ్వడం మంచి కార్యక్రమం అని చెప్పారు. బాల్యవివాహాలు, గృహహింస, మానవ అక్రమరవాణాను నిరోధించేందుకు గ్రామస్థాయిలో శిక్షణ అవసరమన్నారు. మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాలు సమాజాన్ని పీడిస్తున్న పెద్దసమస్య అని చెప్పారు. ఇటువంటి సమస్యలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. గ్రామాలలో కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసినప్పుడే ఇటువంటి అరికట్టడానికి వీలవుతుందని తెలిపారు. ల్యాంప్‌సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్ మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో అవగాహన కల్గిన తల్లి ఉంటే ఆకుటుంబాన్ని రక్షించుకోవచ్చని చెప్పారు. ప్రస్తుతం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి వాటికి యువత ప్రభావితం అవుతుందని వాటిని పెద్దలు గమనించి నిరోధించాలన్నారు. అనంతరం మానవ అక్రమ రవాణాను అరికట్టాలంటూ పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో పి. ప్రసూన, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సునీత, మహాలక్ష్మి, ల్యాంప్ సంస్థ కోఆర్డినేటర్లు కె.వెంకటేశ్వరరావు, షేక్.బాజీ. మంగయ్య, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

నక్షత్రవనానికి జప్తు వాహనాల తరలింపు



తాడేపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి వాహనాలను తరలిస్తున్న వాహనాలు



వాహనాలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు

తాడేపల్లిరూరల్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు తుప్పు పట్టి విష పురుగులు చేరడం, వాహనాలు పార్కింగ్ చేసిన స్థలంలో పోలీసులకు రెస్ట్ రూం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తుండటంతో పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న సీజ్ చేసిన వాహనాలను మంగళవారం తరలించే కార్యక్రమాన్ని చేపట్టారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పక్కనే సుమారు 300 ద్విచక్ర వాహనాలు, 10 కార్లు, నాలుగు ఆటోలు, ఇతర వాహనాలు మరో 10 ఉన్నాయి. ఇవన్నీ వివిధ కేసుల్లో ఉండడంతో వాటిపై క్రైం నెంబర్ వేసి తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని నక్షత్రవనంకు తరలిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ఇక్కడ వివిధ ప్రాంతాల నుంచి విధులు నిర్వహించే వారికి గెస్ట్‌హౌస్ ఏర్పాటు చేసే ఆలోచనలో పోలీస్ శాఖ ఉందని, అందుకుని ఈ స్థలాన్ని బాగుచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

'వైకుంఠపురం'లో శిఖర ప్రతిష్టా మహోత్సవాలు

తెనాలి: స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కళాన్యాసపూర్వక శిఖర ప్రతిష్ఠా మహా సంప్రోక్షణ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మూడురోజులు జరిగే వేడుకల్లో రెండో రోజు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 8 నుంచి ఆలయంలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచన, పంచగవ్య ఆరాధన, పంచగవ్య ప్రాశన, ప్రధాన కుంభాలకు ఆరాధన, అగ్ని మథనం, ప్రధాన అగ్ని, సర్వ కుండేషు అగ్నిప్రతిష్ఠ, యుక్త హోమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు, భూవరాహస్వామి మూలమూర్తులకు అష్ట కలశస్నపన, విశేష అభిషేకం చేశారు. నూతన శిఖరాలు, నూతన ఉత్సవ మూర్తులకు, శ్రీప్రసన్న ఆంజనేయస్వామి వారికి, పంచగవ్యాధి వాసం, క్షీరాధివాసం, జలాధివాసము, అధివాస హోమాలు జరిపించారు. సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. ఉత్సవాల వివరాలను ఆలయ అర్చకులు వివరించారు. ఉత్సవాలలో చివరి రోజైన బుధవారం ఉదయం శ్రీస్వామివార్ల శిఖర ప్రతిష్ఠ, జీవ కళాన్యాసం, నూతన ఉత్సవ విగ్రహాలు, ప్రసన్నాంజనేయస్వామికి మూర్తి ఆవాహన నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటల్నుంచి శ్రీవారి అన్నప్రసాద వితరణ ఉంటుందని వివరించారు.

భగవద్గీత పారాయణం



తెనాలి: పట్టణంలోని రామలింగేశ్వరపేట దేవి చౌక్‌లో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రావణ మాసం మంగళవారం సాయంత్రం ప్రత్యేక కుంకుమార్చన చేశారు. అనంతరం వందమంది సుహాసినిలతో భవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. తాడేపల్లి లలితా కామేశ్వరి, ధారా సత్యవతి, పాతూరి నిర్మల, మరో వంది మంది సుహాసినిలు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ టీవీఎస్ శాస్త్రి, ఉపాధ్యక్షుడు చివుకుల శివరామ్‌ప్రసాద్, కార్యదర్శి విష్ణుభట్ల రత్నాకర్‌శాస్త్రి, కోశాధికారి ధారా బాలకృష్ణ, కోదండరాం, సభ్యులు కొండపి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

1న టెన్నికాయిట్ సెలక్షన్స్

తాడేపల్లిరూరల్ : 36వ గుంటూరు జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ సెలక్షన్స్ సెప్టెంబర్ 1వ తేదీన చెరుకుపల్లి మండలం, కావూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గుంటూరు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు బ.ఇ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పెనుమాక జిల్లా పరిషత్ పాఠశాల పి.ఇ. అధ్యాపకులు రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో పాల్గొనే విద్యార్థులు కావూరు స్కూల్ ఫిజికల్ డైరెక్టర్, ఆర్గనైజింగ్ సెక్రటరి డి. ప్రమీల, సెల్ నెం. 9963279436 ను సంప్రదించాలని, ఇక్కడ సెలెక్ట్ అయిన క్రీడాకారులు శ్రీకాకుళం జిల్లా పలాస మండల వజ్రపు కొత్తూరులో సెప్టెంబర్ 14 నుంచి 16 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన ఆ ప్రకటనలో తెలియజేశారు.

డయేరియాపై అవగాహన



డయేరియాపై అవగాహన కల్పిస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ పి. తేజ్‌సంగీత్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెడ్ మాస్టర్ రాఘవయ్య ఆధ్వర్యంలో మంగళవారం డయేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కో ఆర్డినేటర్ పి. తేజ్ సంగీత్ విచ్చేసి నీటి వనరులు మరియు సంరక్షణ గురించి వివరించారు. ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా నీరు వృథా చేయరాదని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ప్రతి ఒక్కరు ఒక్క మొక్కనైనా నాటాలని అన్నారు. ఐఎస్ఏ కో ఆర్డినేటర్ రంగారావు మాట్లాడుతూ ప్రతిరోజు గోరువెచ్చని నీటిని తాగడం ద్వారా జీర్ణక్రియ బాగా పనిచేస్తుందని, సురక్షితమైన తాగునీరు, పౌష్టికాహారం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డయేరియా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని వివరించారు. విద్యార్థులకు ఏడు రకాలైన హ్యాండ్ వాష్ మార్గాలను సి.హెచ్.ఓ. శిరీష, హిమబిందు వివరించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ జాన్ అహ్మద్ నీటి పరీక్షలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మండల సమన్వయ కర్త, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఎ.ఎన్.ఎమ్‌లు సత్యవతి, సరిత, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంగనా వ్యాఖ్యలపై ఏపీ రైతు సంఘం ఆగ్రహం

జాతీయ రహదారిపై నిరసన



ఎంపీ కంగనా రనౌత్ వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: రైతాంగం మెడలు విరిచే మూడు నల్లచట్టాలను రద్దు చేయాలని, సంవత్సరం పాటు దేశవ్యాప్తంగా రైతులు చేపట్టిన మహా ఉద్యమంపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చౌకబారు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుల నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎంపీ కంగనా రనౌత్ రైతులు చేస్తున్న పోరాటాన్ని, ఉద్యమాన్ని కించపరుస్తూ మాట్లాడడం దుర్మార్గమన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న రోడ్డెక్కి తమ హక్కుల కోసం పోరాటం చేశారని, ఈ రైతాంగ మహా ఉద్యమంలో 700 మందికి పైగా ప్రాణాలు పణంగా పెట్టి అమరులయ్యారన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేట్ వ్యవసాయాన్ని తీసుకొచ్చేందుకు, వ్యవసాయ రంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర పన్నిందన్నారు. రైతాంగాన్ని విచ్ఛిన్నం చేసే మూడు నల్లచట్టాల రద్దు కోసం రైతులు సాగించిన ఉద్యమాన్ని అవహేళన చేసిన ఎంపీ కంగనా రనౌత్ వెంటనే రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎంపీ కంగనా చేసిన వ్యాఖ్యలు బీజేపీకి సంబంధం లేదని నాయకత్వం చెప్పడం దిగజారుడుతనానికి నిదర్శమన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య మాట్లాడుతూ ఏడాది కాలం పాడు మూడు నల్లచట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఎన్నో పోరాటాలు చేసి, జైళ్లకు వెళ్లి, ప్రాణాలు అర్పించిన చరిత్ర రైతాంగ ఉద్యమానికి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జొన్న శివశంకరరావు, రైతు సంఘం రాజధాని నాయకులు కొర్రపోలు ఈశ్వర్ రెడ్డి, రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు మోదుగుల శ్రీనివాస్ రెడ్డి, రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, దండమూడి సాంబశివరావు, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, రజక వృత్తిదారుల సంఘం తాడేపల్లి మండల నాయకులు ఈమని రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అప్పలస్వామి, నీరుడు దుర్గారావు, కౌలు రైతు సంఘం నాయకుల కంచర్ల జేమ్స్, గుడిసె శ్రీనివాసరావు, పార్వతి పాల్గొన్నారు.

జయమంగళ గౌరీదేవి...



దుగ్గిరాల మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ తిరుపతమ్మ గోపయ్యస్వామి వారి సన్నిధిలో అమ్మవారి అష్టోత్తర శత సహస్ర గాజుల గౌరీ పూజను అంగరంగ వైభవంగా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సుబ్బారావు మాట్లాడుతూ తెనాలి వాస్తవ్యులు, ఆధ్యాత్మిక సేవకురాలు ఉప్పలూరి శారదా చలపతి ఆధ్వర్యంలో శ్రావణ మంగళవారం సందర్భంగా అమ్మవారికి అష్టోత్తర శత సహస్ర గాజుల గౌరీ పూజ నిర్వహించామని, ఉప్పలూరి శారదా చలపతి భక్తి కీర్తనలు ఆలపించారని, హరికథా భాగవతారిణి బెజ్జంకి నాగమణి అమ్మవారి విశిష్టతను వివరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

-తాడేపల్లిరూరల్

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మంగళగిరి పట్టణ పరధిలోని ఇందిరానగర్‌లో మారుతీ మహిళా సొసైటీ పీయూ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మంగళవారం హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరానగర్ యుపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ పి. అనూష మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు, జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ విభాగం సహకారంతో ''మీకు తెలుసా?'' కార్యక్రమం ద్వారా హెచ్ఐవీ / ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించామని, హెచ్ఐవీ లక్షణాలు, అవి రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించామని, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్నచూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలో వివరించామని, హెచ్ఐవీ / ఎయిడ్స్, క్షయ వ్యాధి, సుఖ వ్యాధులు–చికిత్స గురించి అవగాహన కల్పించామని తెలిపారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ యాక్ట్ 2017, ఎఆర్‌టి మందులు, ఏపీఎస్‌ఏసీఎస్ యాప్, టోల్‌ఫ్రీ నెంబర్ 1097 గూర్చి ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు అవగాహన కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మారుతి మహిళా సొసైటీ పీయూ ప్రాజెక్ట్ మేనేజర్ జె. గంగాభవాని, ఏఎన్ఎం ప్రత్యూష, బీఆర్‌డబ్ల్యూ నాగరాజు, అంజలి, శారా కుమారి, సాయి సుధ, చిరంజీవి, పి.ఇ.లు అరుణ కుమారి, రాణి, అమ్మాజీ పాల్గొన్నారు.

ఎన్నారై కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన

మేడికొండూరు: మీకు తెలుసా ప్రచారంలో భాగంగా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఆగస్టు 12 నుంచి అక్టోబరు 11వ తేదీ వరకు న్యాకో, ఎస్‌ఏసీఓ నేతృత్వంలో 'మీకు తెలుసా' రాష్ట్రస్థాయి ఇంటెన్సిఫైడ్ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా రీసోర్స్ పర్సన్ వాసుదేవ్ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో వంద గ్రామాల్లో అవగాహన కల్పిస్తుందన్నారు. ఎయిడ్స్, టీబీ, తదితర వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో భాగంగా రక్త పరీక్షలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్షత కలిగి ఉండరాదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు రాణి, చిన్ని, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనతోనే సత్కర్మలకు అవకాశం



తెనాలి: ఆధ్యాత్మిక భావనతోనే మానవుడు ఉత్తమ కర్మలు చేపట్టే అవకాశం ఉంటుందని 'ఇస్కాన్' తెనాలి జగన్నాథ మందిరం అధ్యక్షుడు సింహ గౌరదాస్ అన్నారు. పట్టణంలోని నాజరుపేటలో ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా కృష్ణాష్టమి వేడుకలు తెనాలి రామకృష్ణకవి కళా క్షేత్రంలో వైభవంగా నిర్వహించారు. చివరిరోజు మంగళవారం ఉదయం స్వామివారికి ధూప దీప హారతులు ఇచ్చిన విశేషమైన కీర్తనలను ఆలపించారు. 108 రకాల పిండి వంటలతో ప్రసాదాన్ని పంపిణీ చేశారు. సింహ గౌరదాస్ సందేశమిస్తూ, భగవంతుడికి నిత్యం చేసే సేవ వల్ల మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని చెప్పారు. అంచే వెంకట్రావు, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ఉమ్మలనేని జానకీ రామచంద్రరావు, గోపినాథ్ దాస్, జనార్దన్ దాస్ పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు.

చిన్నారులకు అభినందన పత్రాలు



రాయపూడి(తాడికొండ): కేరళ వైనాడ్ బాధితులకు సాయమందించినందుకు గాను తమ పాఠశాల చిన్నారులకు ప్రభుత్వం నుంచి అందిన ప్రశంశా పత్రాలు అందించారని రాయపూడి ఉర్దూ పాఠశాల హెచ్ఎం మహమ్మద్ ఖాసిం తెలిపారు. తమ పాఠశాల చిన్నారులు గ్రామంలో ఇంటింటికీ తిరిగి విపత్తు బాధితులను ఆదుకునేందుకు రూ.4500 నగదు సేకరించి కేరళ సహాయ నిధికి యూపీఐ ద్వారా పంపించడం జరిగిందన్నారు. ఇందుకు గాను కేరళ ప్రభుత్వం రసీదుతో పాటు చిన్నారులకు అభినందన పత్రాలను అందించడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల విద్యనభ్యసించే సమయంలోనే చిన్నారులకు చదువుతో పాటు సామాజిక బాధ్యతను తెలియజేసేలా చేసిన ఈ కార్యక్రమం భవిష్యత్తులో వారికి మరిన్ని కార్యక్రమాలు చేసేందుకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది నూర్జహాన్ పలువురు చిన్నారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

తహసీల్దార్ గోపాలకృష్ణ



మాట్లాడుతున్న తహసీల్దారు గోపాలకృష్ణ

తెనాలిఅర్బన్: జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ గోపాలకృష్ణ, హౌసింగ్ ఈఈ వై.భాస్కరరావు ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం జగనన్న కాలనీల నిర్మాణాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికను రూపొందించిందని, దానిని వెంటనే అమలు చేయాలని సూచించారు. అధికారులు ఇచ్చిన టార్గెట్ ప్రకారం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని ఇళ్ల నిర్మాణాల పథకం డిసెంబర్ 31తో ముగియనున్నదని చెప్పారు. ఆ లోపు మొదటి విడత ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. కాంట్రాక్టర్‌లు, లబ్ధిదారులతో మాట్లాడి పనులు పునఃప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా లబ్ధిదారులు సొంతగా నిర్మించుకుంటూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని తమ దృష్టికి తీసుకువస్తే అలాంటి వారికి డ్వాక్రా రుణాలు ఇప్పించే విధంగా చూడాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణాలు ప్రారంభమైన వెంటనే ఎప్పటికప్పుడు బిల్లులను అప్‌లోడ్ చేస్తూ లబ్ధిదారుల అకౌంట్‌లో నగదు జమ అయ్యే విధంగా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, హౌసింగ్ డీఈ రఫీ ఉల్లాఖాన్, హౌసింగ్ ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.